క్లుప్తంగా

4 నుంచి జనార్దనస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


బాలాలయంలో పూజలు నిర్వహిస్తున్న విష్ణుమాల దీక్షధారులు

అనపర్తి: స్థానిక పాతవూరులో జీర్ణోద్ధరణ గావించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల తోపాటు వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన, మహా సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని విష్ణు మాల ధారణ చేసిన దీక్షధారులు శుక్రవారం బాలాలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి రామకృష్ణ ఆచార్యులు ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి పసుపు,కుంకుమ పూజలు జరిపారు.

ఆచార్య అల్లం అప్పారావుకు నివాళి


ఆచార్య అల్లం అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కొద్దికాలం పనిచేసి, ఇటీవల మృతి చెందిన ఆచార్య అల్లం అప్పారావుకు యూనివర్సిటీ అధికారులు నివాళులర్పించారు. ఈ మేరకు వీసీ ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే వీసీగా పనిచేసే కాలంలో నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి, ప్రస్తుతం ఉన్న ప్రాంగణంలో యూనివర్సిటీ ప్రగతి బాట వేసిన ఆయన పనితీరు, అంకితభావం అందరికీ ఆదర్శనీయమన్నారు.

విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు పూర్తి


విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ కుశలవదొర

మధురపూడి: పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కోరుకొండ ఎంఈఓ కుశలవదొర తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ మండలంలోని 55 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ సుమారు 7,300 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. మండలకేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయానికి చేరిన కిట్లను శనివారం నుంచి సంబంధిత పాఠశాలలకు అందజేస్తామన్నారు. దానిలో భాగంగా వచ్చిన మెటీరియల్‌ను పరిశీలించినట్టు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థులతో కథలు చదివిస్తున్న లైబ్రేరియన్ అరుణ్ కుమార్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చదవడం మాకిష్టంలో భాగంగా తరగతులు నిర్వహించారు. పుస్తక సమీక్ష, పుస్తక పఠనం చేయించారు. హాజరైన విద్యార్థులకు చల్లని పానీయం, బిస్కట్లను అందించారు.

లారీలు ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలు

రంగంపేట: రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలైనట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్యపేట నుంచి కాకినాడ వెళుతున్న సిమెంటు లారీ వడిశలేరు వినాయకుడి గుడి వద్దకు వచ్చే సరికి ఏడీబీ రోడ్డులో ఆగి ఉన్న ఇసుక లారీని బలంగా ఢీకొంది. సిమెంట్ లారీ క్లీనర్ పాపాని వీరబాబు రెండు కాళ్లకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరిష్కారం దిశగా కోరుకొండ భూ సమస్య

- ఫలించనున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రయత్నం
- తాడేపల్లిలోని సీఎం కార్యాలయంలో సమావేశం


తాడేపల్లిలో జరిగిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశం

రాజానగరం/మధురపూడి: భూములున్నాయి, కానీ వాటిని అమ్ముకునేందుకు అవకాశం లేదు. పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం క్రయవిక్రయాలు చేద్దామన్నా ఆయా భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధం ఉండటంతో ఆ భూముల రైతులు గత దశాబ్ద కాలంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాటి నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించే దిశకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి కార్యదర్శితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో తాడేపల్లిలోని సీఎం కార్యాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా భూములకు రిజిస్ట్రేషన్ల అవకాశం కల్పించాలనే రైతుల కోరిక చర్చకు రావడంతో ఆయా భూముల రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతుంది.

సమస్య ఇదే..

కోరుకొండ మండలం కాపవరం, శ్రీరంగపట్నం, కోరుకొండ, గోకవరం మండలం అచ్యుతాపురం పరిసర గ్రామాల్లోని భూములను 22 ఏ-1 సి ప్రకారం నిషేధ జాబితాలో చేర్చారు. దీనితో ఆయా భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆగిపోయాయి. ఫలితంగా సుమారు 10 వేల మంది రైతులు తమ భూములకు క్రయ విక్రయాలు చేసుకునేందుకు వీలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దశాబ్ద కాలంగా నెలకొన్న ఈ సమస్య పరిష్కారం కోసం ఆయా రైతాంగం ఎక్కని మెట్లు, దిగని గడపలు లేవు. సమస్య పరిష్కారానికి హామీలిచ్చే నాయకులేగానీ, పరిష్కారం కోసం కృషి చేసిన వారు లేరు. ఈ నేపథ్యంలో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పలుమార్లు సీఎంని కలుసుకుని ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో సీఎం కార్యాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి సీసీఎల్ఏ సాయిప్రసాద్, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, న్యాయశాఖ కార్యదర్శి దుర్గాప్రసాద్, కలెక్టర్ కె.మాధవీలత, రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల ఏకరువు

సమావేశంలో పాల్గొన్న కోరుకొండ మండలానికి కొందరు రైతులు గత కొన్ని సంవత్సరాలుగా తమ భూములకు క్రయవిక్రయాలు జరగక పడుతున్న ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఇల్లు, స్థలాలు, పొలాలు ఇలా సమస్తం నిషేధ జాబితాలో ఉండటం వల్ల పిల్లల పెళ్లిళ్లు, చదువులు ఇలా.. ఏ అవసరం వచ్చినా అమ్ముకోడానికి అవకాశం ఉండటం లేదన్నారు. ఈ భూములపై ఉన్న నిషేధాన్ని తొలగించి, రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. అందుకు ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా స్పందించడంతో త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తపరిచారు. సమావేశంలో పాల్గొన్న రైతులలో డాక్టర్ కుంచె వెంకటరమణ, కోరుకొండ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు బలుసు బద్రీనారాయణ, కోకా నరసింహరావు, నీరుకొండ నాగేశ్వరరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ పూజలు


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తిస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ సంకల్ప పూజల్లో భాగంగా శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. కూర్మము గరుడాళ్వార్ ధ్వజస్తంభం శిఖరాలకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం, వాస్తు పూజ కార్యక్రమాలు చేశారు. పండితులు రేజేటి రామాచార్యులు సారథ్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు పర్యవేక్షణలో జరిగిన పూజల్లో 18 మంది దంపతులు యజ్ఞకర్తలుగా పాల్గొన్నారు. ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ శనివారం నిర్వహించనున్నారు.

పీహెచ్‌సీలో ఓపీ, ప్రసూతి సేవలు పెంచాలి

డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు


రంగంపేట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

రంగంపేట: పీహెచ్‌సీలో ఓపీ, ప్రసూతి సేవలను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) కె. వెంకటేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పీహెచ్‌సీలో ఉన్న మందులు, వివిధ రకాల వ్యాక్సిన్‌ల నిల్వలతో పాటు వాటి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇటీవల సింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని సందర్శించారు. సింగంపల్లి, పరిసర గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు, ఓపీ సేవలు అందించాలని ఆదేశించారు. దీనికి రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న కొంత మంది పారా మెడికల్ సిబ్బందిని తాత్కాలిక పద్ధతిన ఎటాచ్ చేయవలసిందిగా వైద్యాధికారి డి.లావణ్యను ఆదేశించారు. డాక్టర్ పి.నాగ శ్రీవిద్య, డాక్టర్ ఎ.అనూష, ఎంపీహెచ్‌ఈఓ ఎస్‌వీబీ శంకర్, ఎస్‌యూఓ జీవన్‌కుమార్, హెల్త్ సూపర్ వైజర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

యువత లక్ష్యాన్ని సాధించాలి


యువతనుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రంగంపేట: యువత లక్ష్యాన్ని ఎంచుకుని నిరంతరం సాధన చేసి ఆ దిశగా విజేతలుగా నిలవాలని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో యువతకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వేసవి వెన్నెల వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ఆధ్యాత్మిక, ఆరోగ్య, వికాస నైపుణ్యాలు తదితర అంశాలను ఆచరణలో పెట్టాలని కోరారు. భయం, నిరాశ, నిస్పృహ, వ్యతిరేక దృక్పథం, వంటి అభివృద్ధి నిరోధక అంశాలకు దూరంగా ఉండడానికి యువత కృషి చేయాలన్నారు. తుని సబ్ జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు, జిల్లా యువజన విభాగ సమన్వయ కర్త సుక్కి రెడ్డి సాయి సుధాకర్, జిల్లా విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని వినాయక వెంకటసాయి ఆలయంలో శుక్రవారం శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పురవీధుల్లో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. గత నెల 24న ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 4వ తేదీతో ముగియనున్నాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా శనివారం భారీ అన్నసమారాధనను నిర్వహించనున్నారు.

విద్యార్థులకు రక్షిత తాగునీరు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించడం ఏర్పాటు చేసిన రెండు ఆర్వోప్లాంట్లను శుక్రవారం ప్రారంభించారు. వీటిని నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం అందజేసింది. ఈ కళాశాలలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటి ద్వారా రోజుకు నాలుగు వేల లీటర్ల రక్షిత నీరు అందుతుంది. ఈ ప్లాంట్లను ప్రిన్సిపల్ సీహెచ్ దొరబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి కిట్లు చేరవేయాలి


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే సమయానికే జగనన్న విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలను చేరవేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం సూచించారు. దివాన్‌చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ పాయింట్ నుంచి మండలంలోని ఇతర పాఠశాలలకు ఈ కిట్లను సరఫరా చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను చూసి, ఎంఈఓ ఎం.రామన్నదొర, ఇతర ఉపాధ్యాయులకు కొన్ని సూచనలిచ్చారు.

చిన్నారుల ప్రతిభ

కడియం: పేపర్‌తో వివిధ రకాల కళాకృతులు తయారు చేయడంలో చిన్నారులు ప్రతిభ చూపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. అనంతరం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల పాల్గొన్నారు.

పుట్టాల కోనేరు పరిశీలన


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న యూకే నాయర్

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలోని పుట్టాల కోనేరును శుక్రవారం కేంద్ర ప్రభుత్వ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ యూకే నాయర్ పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఈ చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ పనులను నాయర్ పరిశీలించారు. ఆయనకు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు.

పోటీతత్వంతో ఉన్నత శిఖరాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- ఐఎంఏ అర్హత పరీక్షా ఫలితాలు ప్రకటించిన వైద్యులు



విద్యార్థుల పేర్లు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: విద్యార్జనలో నిరంతరం పోటీతత్వంతో విద్యార్థులు తమకు తాము మెరుగుపరచుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించి నిర్దేశించుకున్న విజయతీరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనపర్తి శాఖ, స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత విద్యా పథకానికి సంబంధించి మే 1న అర్హత పరీక్షను నిర్వహించారు. 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్షా ఫలితాలను వెల్లడించేందుకుగాను జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఐఎంఏ అనపర్తిశాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు తమకు అందిన అవకాశాన్ని అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. హైదరాబాదు యశోదా ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ చీఫ్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థికంగా అవకాశం లేని విద్యార్థుల విద్యాభ్యాసం నిలిచిపోకూడదన్న ఆశయంతో, వారికి ఉన్నత విద్యను అందించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతో జీబీఆర్ విద్యాసంస్థ, ఐఎంఏ అనపర్తిశాఖలు ఈ ఉచిత విద్యా పథకాన్ని ప్రారంభించాయన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిభ కలిగిన విద్యార్థులకు తరగతికి ఐదుగురు చొప్పున నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల పేర్లను ఎమ్మెల్యే ప్రకటించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు గాను లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి వారి పేర్లను ప్రకటించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఐఎంఏ సభ్యులు డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సంధ్య, డాక్టర్ వరలక్ష్మి, పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్, విద్యాసంస్థల పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతతో రోడ్డు విస్తరణ పనులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బొబ్బిల్లంకలో పరిశీలన


బొబ్బిల్లంక వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాజమహేంద్రవరం - సీతానగరం నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కాంట్రాక్టర్‌కు సూచించారు. ముగ్గళ్లలో గురువారం రాత్రి 11 గంటల వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, అనంతరం బొబ్బిల్లంక వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తి అధ్వాన స్థితికి చేరిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రహదారి విస్తరణ పనుల ఆవశ్యకతను పలుమార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మండల ప్రజల ఆకాంక్ష మేరకు శాశ్వత పద్ధతిలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. రానున్నది వర్షాకాలం అయినందున రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆశ చూపి రూ.50 లక్షల దోపిడీ

రాజానగరం: రిజర్వు బ్యాంకు తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలో రూ. రెండు వేల నోట్ల చలామణి నిలిచిపోవడంతో కొందరు అక్రమార్కులు దానిని కూడా తమ అనుకూలంగా మలుచుకుంటున్నారు. అమాయకులను ఎంపిక చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో ఈ విధంగా ఒక వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు తీసుకుని ఉడాయించారు. సీఐ కాశీవిశ్వనాథ్ శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన మాజేటి లక్ష్మీనారాయణ అనే కిరాణా వ్యాపారి అత్యాశకు పోయి రూ. 50 లక్షలు పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం రూ. రెండు వేల నోట్ల మార్పిడి కష్టతరంగా మారిందని, ఈ కారణంగా ఆ నోట్లు రూ.60 లక్షలు తీసుకుని, రూ. 500 నోట్లు రూ.50 లక్షలు ఇస్తే చాలని అతడి స్నేహితుడొకరు ఆఫరు ఇచ్చాడు. దీంతో రూ.10 లక్షలు కలిసొస్తుందని లక్ష్మీనారాయణ ఆశపడ్డాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసి ఉంచిన సొమ్ముల నుంచి రూ. 50 లక్షలు తీసుకుని అవతలి వ్యక్తులు (మూర్తి, రామలింగేశ్వరరావు, ప్రవీణ్)లు చెప్పిన విధంగా గురువారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొంతమూరు నూకాలమ్మ గుడి వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఆ వ్యక్తులు పోలీసుల మాదిరిగా హారన్ వేసుకుంటూ వచ్చి, అతడి నుంచి రూ.50 లక్షలు తీసుకుని ఉడాయించారు. తాను దోపిడీకి గురైన సంగతి తెలుసుకున్న లక్ష్మీనారాయణ రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

అన్నదాతకు జవసత్వాలు

- రైతు ఖాతాల్లో రూ.31 కోట్ల సొమ్ము నేరుగా జమ చేసిన ప్రభుత్వం
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో రైతు భరోసా పథకం సాయం విడుదల


పొలంలో పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

పెదపూడి: అన్నదాతలకు రైతు భరోసా పథకం వరంగా మారింది. నేరుగా వారి ఖాతాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొమ్ము జమ చేస్తుండడంతో వారికి కొత్తగా జవసత్వాలు వచ్చినట్టు ఉంటోంది. గత కొన్నేళ్లుగా అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సాగు పరిస్థితి సాగుకు వెనుక, ముంపునకు ముందు అన్న చందంగా ఉంది. ఏళ్ల తరబడి పెట్టుబడులు పెట్టి ప్రకృతి విపత్తులకు గురై చేతికి గింజ దక్కకుండా, దక్కిన గింజ దళారుల పాలవుతూ అన్నదాత అష్టకష్టాలు పడేవారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు తల్లడిల్లిపోయారు. ఆత్మహత్య శరణ్యమనేలా పలువురు సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి ఉండేది. వారిని ఆదుకోవాల్సిన గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ చేతులెత్తేసింది. అటువంటి పరిస్థితుల్లో 'నేను ఉన్నాను, నేను విన్నాను' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రతి పంటకు రైతు భరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఐదో ఏడాది మొదటి విడత మళ్లీ అన్నదాతలకు రైతు భరోసా పథకం విడుదలైంది. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం 56,588 మంది రైతులకు, రూ. 31,09,04000 రైతుల ఖాతాల్లో జమ అయింది.

ఆదర్శంగా ఆర్బీకేలు

రైతు భరోసా కేంద్రాలు రైతులకు సేవలందించడంలో ఆదర్శంగా నిలిచాయి. రైతుకు విత్తు దగ్గర నుంచి చేతికి అందివచ్చిన ప్రతి గింజ వరకు ప్రభుత్వం హామీ ఉంటూ అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలైన సేవలందుతున్నాయి. గ్రామాల్లోని ఆర్బీకేల వద్దే వారు సేవలు పొందడంతో మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈకేవైసీ, ఈ క్రాప్, ఈ మార్కెట్ విధానాలతో రైతులకు మరింత మేలు జరుగుతుంది.

రైతు భరోసా వివరాలు..

మండలం	రైతులు	జమ అయిన సొమ్ము
అనపర్తి	4,106	2,25,83,000
పెదపూడి	7,690	4,22,95,000
బిక్కవోలు	6,685	3,67,67,500
రంగంపేట	8,793	4,83,61,500
రాజానగరం	10,948	6,02,14,000
సీతానగరం	7,964	4,34,72,000
కోరుకొండ	10,402	5,72,11,000
మొత్తం	56,588	31,09,04,000

రైతు పక్షపాతి సీఎం జగన్



రైతు భరోసా పథకం సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. పెట్టుబడులకు చేదోడుగా ఉంది. పంట నష్టపోయిన సమయంలో పంటల బీమా, నష్టపరిహారం ఎప్పటికప్పుడు అందడంతో ఆర్థికంగా నిలబడగలిగాం. రైతు పక్షపాతి సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– తోటకూర సత్యనారాయణ, రైతు, కరకుదురు గ్రామం

నేరుగా రైతు ఖాతాలో సొమ్ము జమ



గత పాలకులు రైతుల్ని పీక్కుతిన్నారు. పంటల బీమా, నష్టపరిహారం వంటివి రైతులకు ఇవ్వడంలో కమీషన్లు దండుకున్నారు. పరిహారాన్ని పరిహాసం చేశారు. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రతి రైతు ఖాతాలో నేరుగా సొమ్ము జమ అవుతోంది. రైతులు ఆనందంగా ఉన్నారు.

– నల్ల సాంబమూర్తి రైతు, పెదపూడి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్